ఐ లవ్ కైలాసగిరి వ్యూ పాయింట్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ: పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా ఆధునిక హంగులతో కైలాసగిరిపై 'ఐ లవ్ కైలాసగిరి' పేరుతో వ్యూ పాయింట్‌ను వీఎమ్మార్డీఏ ఇన్‌చార్జి మెట్రోపాలిటన్ కమిషనర్ ఏ.మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. పెద్ద అక్షరాలతో బోర్డు ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో వెలుగులు వచ్చేలా విద్యుత్ దీపాలను కూడా అమర్చారు. ఇప్పటికే నగరంలో పలు చోట్ల ఉన్న ఐ లవ్ వైజాగ్ బోర్డులు మాదిరిగానే నూతనంగా కైలాసగిరిపై ఐ లవ్ కైలాసగిరి పేరుతో ప్రత్యేక వ్యూ పాయింట్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యూ పాయింట్ విశేషంగా పర్యాటకులను ఆకట్టుకుంటుందని, సెల్ఫీ పాయింట్‌గా నిలుస్తుందని, ప్రత్యేకతను అభిప్రాయపడ్డారు. ఈ కార్య క్రమంలో ఎస్ఈ ఎం.బలరామరాజు, ఈఈ మధు, వీఎంఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు.

సీనియర్లకు దక్కని మంత్రి పదవులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో అనితకే పట్టం

పోరాటాల వనిత... వంగలపూడి అనిత..

ఐదేళ్లు వైసీపీతో పోరాటమే మంత్రి పదవి వరించింది

ఉమ్మడి విశాఖ జిల్లాలో అనితకు దక్కిన అరుదైన అవకాశం

పాయకరావుపేట నియోజకవర్గం నుండి రెండోసారి టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన వంగలపూడి అనితకు ఉమ్మడి విశాఖ జిల్లాలో అరుదైన అవకాశం దక్కింది. 13 మంది ఉమ్మడి విశాఖ జిల్లాలో ఓటమి ఎమ్మెల్యేలు గెలుపొందినప్పటికీ వనితకే మంత్రి పదవి వరించింది. ఐదేళ్లు అధికార వైకాపాలతో అనునిత్యం పోరాటాలు చేస్తూ ధీర వనితగా పేరుగాంచిన అనితకు మంత్రి పదవి దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయురాలిగా పని చేసుకుంటూ తొలిసారి 2014లో టిడిపి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆమె, చురుకైన రాజకీయ నేతగా, ప్రతిపక్షాలకు దీటుగా ఎదుర్కొంటూ, ఉద్యమాలు చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లోనే తగిన గుర్తింపు సంపాదించుకున్నారు. రోజు అరెస్టులు, గృహ నిర్బం ధాలతో వైసీపీ ప్రభుత్వం అనితను కట్టడి చేసేది. 2019 ఎన్నికల్లో ఓటమితో మరింత దీటుగా, ప్రతిపక్షంలో ఉంటూ ప్రజల సమస్యలపై అనునిత్యం పోరాటం చేస్తూ, అధికార వైకాపాకు చెమటలు పట్టిస్తూ, అనిత చేసిన అనేక పోరాటాలతో తెలుగు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా చర్చ వేదికల్లో పాల్గొంటూ వైసీపీ ప్రభుత్వ అసమర్థతను ప్రజల్లోకి తీసుకెళ్లగలడంతో ఈ కూటమి ప్రభుత్వంలో ఆమెకు మంత్రి వరించిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మహిళా కోటా, ఎస్సీ కోటా ఆమెకు కలిసి వచ్చాయని అంటున్నారు. విపక్షాలకు తన పదునైన మాటలతో చెమటలు పట్టించే అనిత ధీర వనితే నని టిడిపి కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోనే పెద్ద నగరంగా ఉన్న ఉమ్మడి విశాఖ జిల్లాకు ఒకే ఒక మంత్రిగా మహిళలకు పట్టంకట్టడంపై ఆమె అభిమానులు మరింత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ రాజకీయాల్లో తన మార్కును చూపిస్తారని ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సీనియర్లకు మంత్రి పదవులు దక్కకపోవడంతో వారి అనుచర వర్గానికి మింగుడు పడడం లేదు. సీనియర్లు కాస్త సీరియస్ అవుతున్నట్లు తెలుస్తోంది. ఇంత భారీ మెజారిటీతో గెలిస్తే తమకే మంత్రి పదవులు ఇవ్వకుండా పక్కన పెడతారా అంటూ అధినేతపై గుర్రుగా ఉన్నట్లు తెలుస్తుంది. నిన్న మొన్నటి వరకు మంత్రుల కుర్చీల కోసం పైరవీలు చేసిన వారందరికీ నిరాశ ఎదురయ్యింది. జిల్లాల విభజన నేపథ్యంలో విశాఖపట్నంలో ఒక్కరు కూడా మంత్రి కాకపోవడంపై సీనియర్లంతా చిర్రు బుర్రు లాడుతున్నారు. ఆర్థిక రాజధానిగా ఆధునిక రాజధానిగా రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన జిల్లాగా ఉన్న విశాఖకు మంత్రి పదవి దక్కకపోవడంపై టీడీపీ, జనసేన, బిజెపి క్యాడర్లో పెద్ద ఎత్తున అసంతృప్తి వ్యక్తం అవుతుంది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 15 అసెంబ్లీ స్థానాలలో 13 చోట్ల టిడిపి, జనసేన కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. వీరిలో నర్సీపట్నం నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు (7 పర్యాయాలు ఎన్నికయ్యారు), గంటా శ్రీనివాసరావు (4 నియోజకవర్గాల నుంచి 5 పర్యాయాలు), బండారు సత్యనా రాయణమూర్తి (పరవాడ 3 నియోజకవర్గాల నుంచి 5 పర్యాయాలు), పి.వి.జి.ఆర్ నాయుడు-గణబాబు (2 నియోజకవర్గాల నుంచి 4 పర్యాయాలు), వెలగపూడి రామకృష్ణ బాబు (విశాఖ తూర్పు నియోజవర్గం నుండి 4 పర్యాయాలు) అసెంబ్లీకి ఎన్నికయ్యారు. వీరిలో చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి గతంలో మంత్రులుగా పని చేశారు. అలాగే పంచకర్ల రమేష్ బాబు (2 నియోజకవర్గాల నుంచి 3 పర్యాయాలు), కొణతాల రామకృష్ణ అనకాపల్లి నియోజవర్గం నుంచి (2 పర్యాయాలు) ఎన్నికయ్యారు. కొణతాల రామకృష్ణ ఒక స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు.

అనేకసార్లు ఎన్నికై, రాష్ట్ర మంత్రులుగా పనిచేసిన వారికి, నాలుగు సార్లు ఎన్నికైన వెలగపూడి రామకృష్ణ బాబు, గణబాబు వంటి వారికి మంత్రివర్గంలో స్థానం లభించకపోవడం ఉమ్మడి విశాఖ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. రెండుసార్లు పాయకరావుపేట నుంచి ఎన్నికైన వంగలపూడి అనితకు మంత్రివర్గంలో స్థానం లభించడం పట్ల ఎవరు అభ్యంతరం తెలపడం లేదు. కానీ సీనియర్లను పూర్తిగా విస్మరించడం మంచిదేనా ? అనే చర్చ సాగుతోంది. కొత్త మంత్రివర్గంలో కొంతమంది సీనియర్లకు స్థానం లభించింది. ఆ సూత్రం ఉమ్మడి విశాఖ జిల్లాకు వర్తించలేదు. చంద్రబాబు నాయుడుని మినహాయిస్తే, ఆనం రామనారాయణరెడ్డి, కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి వంటి సీనియర్లు కూడా మంత్రివర్గంలో స్థానం పొందగలిగారు.

ఘనంగా ముత్తంశెట్టి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి వైసీపీ కార్యాలయంలో నిరంతర ప్రజా సేవకుడైన మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు 57వ జన్మదిన వేడుకలు వైసిపి పార్టీ శ్రేణులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా వైసిపి శ్రేణులు కేక్ కటింగ్ చేసి తమ ప్రియతమ నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో 3వ వార్డు అధ్యక్షులు అల్లిపిల్లి నర్సింగరావు, ప్రధాన వైద్యాధికారి పణికుమార్ ఆధ్వర్యంలో పేషెంట్లకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. విశాఖ జిల్లా మైనారిటీ అధ్యక్షులు ముస్తఫా ఆర్థిక సౌజన్యంతో ఎస్ఓఎస్ అనాధ బాలలకు నిత్యావసర సరుకులు, బహుమతులు అంద జేశారు. అవంతి జీవితం గెలుపైనా ఓటమైనా నాయకులు, కార్యకర్తలు మేమంతా అవంతితోనే రాజకీయ పయనం సాగిస్తామని అన్నారు.

ఆనందపురం: ఆనందపురం మండలంలో మజ్జి వెంకటరావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆనందపురం వైసీపీ

మండల కార్యాలయంలో మండల నాయకులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు మాట్లాడుతూ తరగని అభిమానంతో అవంతి శ్రీనివాస్ బర్త్ డే వేడుకలు వాడు వాడల ఘనంగా నిర్వహించారని, అవంతి శ్రీనివాస్ అందరూ వాడని, ప్రజలు ఎప్పుడు అవంతి వెంటే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ బోని అప్పల నాయుడు, కోరాడ అప్పలస్వామి నాయుడు, మరుపిల్ల చిన్నయ్య పాత్రుడు, చందక సూరిబాబు, కళింగ గంగరాజు, బంక శ్రీను, గంటా జగదీష్, గొలగాని కృష్ణ, దొంతల కనకరాజు, గుండు నానాజీ, కొండ్రోతు అప్పలనారాయణ, పినిశెట్టి సింహాచలం నాయుడు, షిణగం దామోదర్, ఎర్ర అచ్చిబాబు, సువ్వాడ జగ్గారావు, కూరాకుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలో మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను పద్మనాభం మండలం వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గెలిచినా ఓడిన మేమెప్పుడూ అవంతి శ్రీనివాసరావు వెంటే ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ కే.రాంబాబు, జడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 2024 చారిత్రాత్మక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సీట్లు సాధించి బుధవారం ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారం చేస్తున్న చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నూతన మంత్రులకు విశాఖపట్నం స్టీలుప్లాంట్ ఉద్యోగుల పిల్లలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యేల్లేటి శ్రీరామ పృధ్వి మాట్లాడుతూ గడిచిన 5 సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి కల్పన లేక ఉన్నత చదువులు చదివి ఇతర రాష్ట్రాల్లో బతుకుతున్నామని కొంతమంది పట్టభద్రులు ఉన్నత చదువులు చదివి కూలీ పనులు చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నారని ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

1217వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలు 1217వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఎస్.ఎం.ఎస్-2 కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నేతలు వరసాల శ్రీనివాసరావు, డి.ఆదినారాయణ, ఎన్.రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడ్డ మంత్రివర్గానికి అభినందనలు తెలిపారు. పూర్వీకుల త్యాగాలు బలిదానాలు పోరాటాల ద్వారా సిద్ధించిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజల ప్రధాన ఆకాంక్ష విశాఖ ఉక్కు తెలుగు వారి హక్కును కాపాడేందుకు మొదటి క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి కేంద్రం ఈ ప్లాంట్ ప్రభుత్వంలో కొనసాగుతుందని

ప్రకటించే వరకు చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర మంత్రివర్గానికి విజ్ఞప్తి చేశారు. కూటమి పెద్దలు ప్రధానితో మాట్లాడి ఉక్కుపై విధించిన కఠినమైన ఆంక్షలు ఎత్తివేసి సెయిల్ విలీనంపై ప్రకటన చేస్తే వెంటిలేటర్ నుండి బయటపడుతుందని సాధారణ ఉత్పత్తికి అవకాశం కల్పిస్తే పరిస్థితులు మెరుగుపడతాయన్నారు. ఈ నెల 13వ తేదీ ఉద్యోగుల వేతనాలు చెల్లిస్తానని సిఎండి ఇచ్చిన హామీని ఈసారైనా నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రమణమూర్తి, గుమ్మడి నరేంద్ర, భాస్కర మూర్తి, మాణిక్యాలరావు, అప్పుల రాజు, యూ.మరిడయ్య, బొడ్డ వెంకటమ్మ, దాసరి శ్రీనివాసరావు, రాజేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోరా...!

ఆర్ అండ్ బీ అధికారులపై గుంటూరు ఆగ్రహం

విశాలాంధ్ర - పెందుర్తి: రోడ్లు, భవనాల శాఖ అధికారుల తీరుపై పెందుర్తి నియోజకవర్గం నుండి ఇండిపెండింట్ అభ్యర్థిగా పోటీ చేసిన గుంటూరు వెంకట నరసింహమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుచోట్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పెందుర్తి, సరిపల్లి మధ్యలో గల కల్వర్టు శిధిలమైనా, కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. దుర్గాలమ్మ గుడి సమీపంలోని ఈ కల్వర్టుకు రక్షణ గోడ లేకపోవడంతోపాటు గతంలో వేసిన సిమెంట్ పిల్లర్లు కూడా విరిగిపోయాయి. వాహనాదారులు ఏ మాత్రం ఏమరుపాటుగా వచ్చినా పక్కనే గల లోతైన గెడ్డలో పడిపోయే ప్రమాదం ఉందన్నారు. మరోవైపు ఈ కల్వర్టు వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఆ ప్రాం తాన్ని పరిశీలించిన గుంటూరు నరసిం హమూర్తి తక్షణం ఆ కల్వర్టు వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకసోవడం దారుణమని మండిపడ్డారు. విశాఖ - అరకు ప్రధాన రహదారిలో గంటకు మూడు వందల వాహనాలు రాకపోకలు సాగిస్తాయని, అలాంటి ముఖ్యమైన రహదారిలో కల్వర్టులు శిధిలమై ఉండటం విచారకరమన్నారు.

సీఎం ప్రమాణ స్వీకారోత్సవంలో భాగస్వామ్యమైన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేయగా సంబంధిత క్రతువును ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా ప్రజలు, అధికారులు వీక్షించారు. జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలు నుంచి జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లికార్జున ఈ కార్యక్రమంలో భాగస్వామ్య మయ్యారు. ఆసాంతం ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఆయనతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల పరిధిలో ఏడు చోట్ల ప్రత్యక్ష ప్రసార కేంద్రాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయగా స్థానిక ప్రజలు, అధికారులు కార్యక్రమాన్ని వీక్షించారు. ఆయా కేంద్రాల్లో ప్రజలు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు వేశారు. తాగునీటి వసతి కల్పించారు. సంబంధిత క్రతువుని సవ్యంగా నిర్వహించేందుకు అనుగుణంగా నోడల్ అధికారులను, సహాయక నోడల్ అధికారులను నియమించారు. మొత్తం క్రతువుని ఇతర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లికార్జున, ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్ పర్యవేక్షించారు.

త్రాగునీరు వృథా - పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - ఆనందపురం: జల వనరులను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. రోజు రోజుకి నీరు వాడకం ఎక్కువవుతున్నప్పటికీ నీటిని ఒడిసిపట్టే అవసరం ప్రాముఖ్యత ఎంతైనా ఉంది. అటువంటిది మంచినీరు వృథాగా పోతే అధికారుల్లో మాత్రం చలనం లేదని ప్రజలు వాపోతున్నారు. వివరాల్లోకెళ్తే ఆనందపురం మండలం లోడగలవానిపాలెం పంచాయతీ శ్రమజీవులు కాలనీలో మంచినీటి పైపులైను వగిలి నీరు వృథాగా పోతున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న శ్రమజీవుల కాలనీలో గత పది రోజులుగా మంచినీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతున్నా అధికారులు చూచి చూడనట్లు వదిలేయడంతో ప్రజలు అవాక్కవుతున్నారు. శ్రమజీవులు కాలనీలో ఇటీవల రోడ్డు పనులు ప్రారంభించడంతో పైపులైన్లు కొత్తగా అమర్చారు. అమర్చిన పైపుల నుండి పది రోజులుగా నీరు వృథాగా పోతోంది. పంచాయితీ అధికారులు స్పందించి నీటి వృధా లేకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు. అసలే వేసవికాలం మంచినీటి సమస్యతో సతమవుతున్న కాలంలో నీరు వృధా పోవడం సరికాదంటున్నారు.

గాయిత్రీ ఆలయంలో సిఎం రమేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి: అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ నాయుడు జన్మదిన వేడుకలు జీవిఎంసీ 93వ వార్డు పరిధిలోని శ్రీ గాయిత్రీ మాత ఆలయంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్నా అద్వర్యంలో సిఎం రమేష్ పేరున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థనలు చేశారు. మాజీ కార్పోరేటర్ రాపర్తి శైలజ చేతుల మీదుగా కేకు కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీగా భారీ మెజార్టీతో గెలిచిన సిఎం రమేష్ కు మంచి జరగాలని గాయిత్రీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. రమేష్ రాకతో పెందుర్తి నియోజకవర్గానికి మంచి రోజులు వచ్చాయని, కొత్త పరిశ్రమలు వచ్చి యువతకు ఉపాధి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు.

కృత్రిమ మేధపై నౌకాదళానికి గీతం శిక్షణ

విశాలాంధ్ర - మధురవాడ: కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వల్ల కలిగే ప్రయోజనాలపై భారత నౌకాదళం అధికారులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక వర్క్‌షాప్‌ను బుధవారం నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ ముఖ్య

అతిధిగా హాజరై కృత్రిమ మేధకు పెరుగుతున్న ప్రాధాన్యతను వివరించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ జి.లక్ష్మీశ్వరి మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌లో నౌకాదళ అధికారులకు కృత్రిమ మేధ ప్రాథమిక అంశాలు, మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, న్యూరల్ నెట్‌వర్క్స్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. గీతం ప్రొఫెసర్లు కె.తమ్మిరెడ్డి, డాక్టర్ జె.హైమా, డాక్టర్ శ్రీనివాస్ చక్రవర్తి తదితరులు రీసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు. గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు హాజరై శిక్షణ పూర్తిచేసుకున్న నౌకాదళం అధికారులకు సర్టిఫికేట్‌లను అందజేశారు. నౌకాదళం అధికారులకు కృత్రిమ మేధ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వడం పట్ల గీతం అధ్యాపకులను అభినందించారు.

అప్పన్నకు మొక్కు తీర్చుకున్న బ్రాహ్మణ ఐక్యవేదిక

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ సింహాచలం తొలి పావంచ వద్ద ఏపీ బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వంగూరి గణేష్ అప్పన్నకు మొక్కు తీర్చుకున్నారు. చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో 108 కొబ్బరికాయలు కొట్టడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ నారా చంద్రబాబు నాయుడు సురక్షంగా ఉండా లని కోరుకుంటూ అలాగే బ్రాహ్మణులకు మేనిఫెస్టోలో పొందు పరిచిన అంశాలని నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎన్ సాయి రాం, బులు సుబ్రహ్మణ్యం, పూడి పెద్ద శర్మ, ప్రసాద్, మురళి, భగవాన్, శేషగిరిరావు, చరణ్, గౌతమేశ్వరరావు, రామకృష్ణ, ఎంఎల్ఎన్ రావు, శ్రీనివాస్ కుమార్, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - మల్కాపురం: గాజువాక మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ బుధవారం కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. కళాకారుల యొక్క సమస్యలను పరిష్కరించి ప్రోత్సాహం కల్పించాలని వినతిలో కోరారు. సంస్థ అధికారులు సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీమ 24 క్రాఫ్ట్ సభ్యులు అధ్యక్షులు గుడివాడ శ్రీనివాసరావు, కార్యదర్శి పైడ్రాజు నూనెల, కోశాధికారి ఉకోటి వెంకటేశ్వరరావు (నాని), అల్లు జోగి నాయుడు, దుబాయ్ రాజు శరత్, జ్యోతి కుమారి, కే.మంగ, తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

డి.ఆర్.వో. కె.మోహన్ కుమార్

విశాలాంధ్ర - విశాఖ కలక్టరేట్: ఈ నెల 16వ తేదీన రెండో సెషన్లలో జరిగే యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోపాలు తలెత్తకుండా సమన్వయం వహించాలని, పరీక్షను సజావుగా నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో పరీక్షను రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. మొత్తం 9,635 మంది పరీక్షకు హాజరవుతున్నారని వివరించారు. ఈ క్రమంలో అధికారులందరూ సమన్వయం వహించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని డి.ఆర్.వో. సూచించారు. ఆయా కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలన్నారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో యూపీఎస్సీ అధికారులు, పర్యవేక్షకులు, లైజన్ అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి తరలి వెళ్లిన టిడిపి నేతలు, కార్యకర్తలు

విశాలాంధ్ర-పద్మనాభం: పద్మనాభం మండలం లో మంగళవారం రాత్రి టిడిపి శ్రేణులు కూటమి నాయకులు కార్యకర్తలు తండోపతండాలుగా చంద్రబాబు నాయుడు నాలుగవసారి సీఎం గా ప్రమాణస్వీకారం ఉత్సవానికి తరలి వెళ్లారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనకు మంచి రోజులు వచ్చాయని ఆంధ్రప్రదేశ్ ఇక నవ్యాంధ్రప్రదేశ్గా మారుతోందని అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది అని వారు అన్నారు .అనంతరం చంద్రబాబు నాయుడుకు జై అంటూ నినాదాలు చేస్తూ జై జైలు కేరింతలతో హుషారుగా ప్రయాణం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సర్పంచులు, ఎంపీటీసీలు,, కార్యకర్తలు ,నాయకులు, జనసేన కార్యకర్తలు ,అభిమానులు, నాయకులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు మొదలగువారు తరలివెళ్లారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించాలి

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తున్నట్టు స్టీల్ మంత్రి కుమారస్వామి, స్టీల్ సహాయ మంత్రి వర్మ ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. నేడు ఉక్కునగరంలోని స్టీల్ సిఐటియు కార్యాలయంలో స్టీల్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌ను ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తున్నట్టు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హార్దీప్ పూరి ప్రకటించడాన్ని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు స్వాగతిస్తోందని ఆయన అన్నారు. దీనికి ప్రధాన కారణం కార్మికుల సుదీర్ఘ పోరాట ఫలితమని ఆయన అన్నారు. అదేవిధంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం జరుగు తోందని, కాబట్టి నూతన స్టీల్ మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి వర్మ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తున్నట్టు, దీనిని సెయిల్‌లో విలీనం చేస్తున్నట్టు ప్రకటించాలని కోరారు. అదేవిధంగా పూర్తిస్థాయి ఉత్పత్తి చేసేందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సెయిల్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేసినా ఇక్కడి కార్మికులకు అమలు చేయకుండా కార్మికులను మనో వేదనకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక యాజమాన్యం సకాలంలో వేతనాలు చెల్లించకుండా కార్మికులను సమాజం ముందు దోషులుగా, దొంగలుగా చిత్రీకరిస్తోందని దీనిని తక్షణం ఆపి సకాలంలో జీతాలు చెల్లించాలని ఆ విధమైన ఆదేశాలను ఇవ్వాలని ఆయన కోరారు. వీటిని చేయడం ద్వారా భారతదేశం ప్రపంచంలోనే మూడో ఆర్థిక శక్తిగా ఎదిగే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని ఆయన వివరించారు. కనుక ఈ విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యను ప్రజలు దృష్టికి తీసుకు వెళ్లాలని ప్రధాన ఆశయంతో గడచిన ఏడు సంవత్సరాలుగా స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తూ అనేకమంది ప్రజలకు తమ రక్తాన్ని అందించిన స్టీల్ కార్మికుల వీరోచిత పోరాటానికి నిదర్శనమని అన్నారు. మొదటి సంవత్సరం లోనే ఈ రక్తదాన శిబిరానికి గవర్నర్ ప్రశంసలను అందుకున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ సంవత్సరం ఈనెల 14వ తేదీన రక్తదాన శిబిరాన్ని ఉక్కు నగరంలోని సిడబ్ల్యూసి-1(అంబేద్కర్ కళాక్షేత్రం) లో నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. దీని ద్వారా స్టీల్ కార్మికుల మనోభీష్టాన్ని కేంద్ర ప్రభుత్వం గమనంలోకి తీసుకొని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైటి దాస్, యు.రామ స్వామి, పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, టీవికె రాజు, కెవి సత్యనారాయణ, మరిడయ్య, నీలకంఠం, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సీజన్ సేల్‌ను ప్రకటించిన లైఫ్‌స్టైల్

విశాలాంధ్ర-విశాఖ సిటీ : భారతదేశపు సుప్రసిద్ధ ఫ్యాషన్ కేంద్రంలలో ఒకటిగా వెలుగొందుతున్న లైఫ్‌స్టైల్, అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'సేల్'ను నేడు ప్రకటించింది. జూన్ 7వ తేదీ నుండి ఈ సేల్ ప్రారంభమైంది. లైఫ్‌స్టైల్ వద్ద కొనుగోళ్లు జరిపిన వినియోగదారులు 50% వరకూ రాయితీని తాజా శైలిలో అత్యున్నత ఫ్యాషన్ బ్రాండ్ల వ్యాప్తంగా పొందవచ్చు. ప్రముఖ జాతీయ మరియు అంతర్జాతీయ ఫ్యాషన్ బ్రాండ్‌ల నుండి తాజా ట్రెండ్‌ల యొక్క విస్తృతమైన ఎంపికతో, లైఫ్‌స్టైల్ యొక్క సేల్ ఫ్యాషన్ ప్రియులకు వారి వార్డ్‌రోబ్‌లను సమున్నతం చేయడానికి గొప్ప అవకాశాన్ని అందిస్తుంది. లైఫ్‌స్టైల్ కలెక్షన్‌లో పూల ప్రింట్లు మరియు పేస్టెల్ రంగులు ఉత్తమ వసంత-వేసవి సంతోషాన్ని అందజేస్తాయి. స్టైలిష్ కలగలుపులో ట్రెండింగ్ షిఫ్ట్, క్రోచెట్ డ్రెస్‌లు, పాతకాలపు బ్లౌజ్స్ కోర్డ్-సెట్‌లు, మహిళల కోసం స్టైలిష్ డెనిమ్ ట్రెండ్‌లు మరియు విస్తృత శ్రేణి ప్రింటెడ్ షర్టులు, సరికొత్త లూజ్ ఫిట్ ప్యాంట్‌లు పురుషుల కోసం ఉన్నాయి.

సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకారానికి ప్రత్యక్ష స్క్రీన్లు

విశాలాంధ్ర-పిఎంపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్‌డిఏ కూటమి నూతన ప్రభుత్వ ప్రమాణస్వీకారాన్ని ప్రత్యక్ష ప్రసారంలో చూసేందుకు అధికారులు ఎల్ఈడి స్క్రీన్ లను జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏడు చోట్ల ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న తరుణంలో భీమిలి నియోజకవర్గంకు సంబంధించి జీవీఎంసీ జోన్ 2 పరిధి 6వ వార్డు పిఎం పాలెంలో సీతారామ కళ్యాణ మండపంలో స్క్రీన్ ఏర్పాటు చేశారు. స్క్రీన్ లో ప్రమాణస్వీకారం చూసేందుకు అధికారులు పెద్ద ఎత్తున కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. కేకు కట్‌చేసి మిఠాయిలు పంచిపెడుతూ, బాణసంచా కాల్చుతూ తమ అధినేత విజయాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు కే వి ఆర్ క్యాటరింగ్స్ అధినేత గరే గురునాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు అనే నేను మాట కోసం ఇంతవరకు ఎదురుచూసామన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి ఘన నివాళులు

విశాలాంధ్ర -మల్కాపురం: టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారారినికి సంఘీభావంగా బుధవారం పారిశ్రామిక ప్రాంత టిడిపి నాయకులు కార్యకర్తలు హెచ్పిసిఎల్ మిలీనియం బంక్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి సంబరాలు చేసుకున్నారు అనంతరం టిఎన్‌టియుసి జిల్లా నాయకులు నక్క లక్ష్మణరావు ఆధ్వర్యంలో గాజువాక డిపో వద్దగల అన్న క్యాంటీన్ వద్ద అన్నసంధన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రామిక సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: జూన్ 12వ తేదీన శ్రామిక సంఘం ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. 12-6-1990 తేదీన శ్రామిక సంఘం ఆవిర్భావం నాటి నుండి గడిచిన 35 సంవత్సరాలుగా విశాఖ ఉక్కు కర్మాగారం నందు సంఘటిత అసంఘటిత కార్మికుల హక్కుల కోసం రాజీలేని సమరశీల పోరాటం చేసి విశాఖ ఉక్కు కర్మాగారంలో వర్షిత ఐదు సార్లు గుర్తింపు యూనియన్ లో భాగస్వామిగా ఎన్నిక కావడం కార్మికుల ఆర్థిక ప్రయోజనాల సాధనలో కీలక భూమిక పోషించి విశాఖ ఉక్కు కర్మాగారం ను బీఐఎఫ్ఆర్ వెళ్లినప్పుడు నాటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు అప్పటి కేంద్ర మాజీ మంత్రి కింజారపు ఎర్రం నాయుడు అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిని ఒప్పించి1333 కోట్ల రూపాయలను ఈక్విటీగా మార్చి నా ఘనత%జదీచీ% గారికి దక్కుతుంది నేడు4 నాలుగో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న తరుణంలో శ్రామిక సంఘం శుభాకాంక్షలు తెలియజేస్తుంది అలాగే కూతమి నాయకులు జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్‌కి మరియు రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి శ్రామిక సంఘం తరపున అభినందనలు తెలియజేస్తున్నాం. అలాగే ఈరోజు యూనియన్ ఆవిర్భావ సందర్భముగా సమతా నగర్ యూనియన్ కార్యాలయంలో జండా ఆవిష్కరణ శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడి రాజుగారు సంతానగర్ జంక్షన్ లో జెండా ఆవిష్కరించడం జరిగినది రాబోయే కాలంలో ఉక్కు పర్మనెంట్ కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులు ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులు వారి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తూ అన్న నందమూరి తారక రామారావు గారి ఆశయ సాధన కోసం శ్రామిక సంఘం కట్టుబడి మరింత ఉత్సాహంతో పనిచేస్తుంది రాష్ట్రంలో ఎన్డీఏ కూటమికి అఖండ మెజార్టీ ఇచ్చిన 164 మంది ఎమ్మెల్యేలను గెలిపించి నా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై రాజు ఊరుకోటి సింహాద్రి జై జాన్ ఎన్ గణపతి హెచ్ సతీష్ పి సత్యం నాయుడు కోనకృష్ణ ఏ రామారావు వై ఆనంద్ ధర్మాల నరసింహారెడ్డి కే రామకృష్ణ పి దానయ్య కే ధనరాజ్ గండేపల్లి శ్రీనివాస్ గండేపల్లి రాజు బి చిన్నారెడ్డి పి తిరుపతిరావు ఎన్ పద్మ మొదలగువారు పాల్గొన్నారు.

రాజకీయ యువ కెరటం

కొండపల్లి శ్రీనివాసుని వరించిన మంత్రి పదవి

రాష్ట్ర మంత్రిగా కొండపల్లి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-గంట్యాడ: విజయవాడ నగరం గన్నవరం ఎయిర్‌పోర్టుకు దగ్గరలో ఉన్న కేసరపల్లి లో జరిగిన ముఖ్యమంత్రి మరియు నూతన మంత్రివర్గంలో ఎంపిక చేయబడిన మంత్రులలో విజయనగరం జిల్లాకు చెందిన గజపతినగరం శాసనసభ్యులు కొండపల్లి శ్రీనివాసునకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు లభించడం విశేషం ఎంపిక కాబడిన ఇతర మంత్రులతో సహా కొండపల్లి శ్రీనివాస్ కూడా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు ఈయన అమెరికాలో ఇంజనీరింగ్ విద్యలో ఎమ్మెస్ పూర్తి చేసుకొని అక్కడనే సుమారు 16 సంవత్సరాలు ఉద్యోగం చేసి ఆ మాతృభూమికి సేవ నిమిత్తము తరలివచ్చారు ఎంపిక పట్ల గజపతినగరం నియోజకవర్గంలో నాలుగు మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు అభినందనలను తెలియజేశారు ఈ కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరియు అమిత్ షా నితిన్ గట్కరి కూడా పాల్గొన్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా మంత్రి శ్రీనివాస్ ను అభినందించారు.

'మూవ్ కూల్' ను ఆవిష్కరించిన మూవ్

విశాలాంధ్ర-విశాఖ సిటీ: భారతదేశపు ప్రముఖ నొప్పి ఉపశమనం బ్రాండ్ మూవ్ 'మూవ్ కూల్' ను విడుదల చేసింది, కోల్డ్ థెరపీతో ప్రేరేపించబడిన గొప్ప ఆవిష్కరణ ఇది. మెంథాల్ యొక్క కూలింగ్ పవర్ తో, ఈ కొత్త ఉత్పత్తి చురుకైన జీవనశైలి కారణంగా గాయాలు, బెణుకులు, కండరాల నొప్పి, స్ట్రెయిన్స్ కారణంగా కీళ్ల మరియు కండరాల నొప్పి నుండి ఉపశమనం అందించడానికి రూపొందించబడింది. డిసెంబర్ 2021లో నిర్వహించిన రెకిట్ పెయిన్ ఇండియా డీసీజీ డిమాండ్ సర్వే ప్రకారం, భారతదేశంలో 4000కి పైగా రెస్పాండెంట్స్ తో, సుమారు 8 శాతం రెస్పాండెంట్స్ తమ నొప్పి సంఘటనలు వ్యాయామం లేదా క్రీడలకు సంబంధించినవని చెప్పారు . మూవ్ కూల్ కండరాల నొప్పి, బెణుకులు, స్ట్రెయిన్స్ సహా శారీరక-ధారుడ్యానికి సంబంధించిన గాయాలను పరిష్కరిస్తుంది. మెంథాల్ చే మద్దతు చేయబడిన, మూవ్ కూల్ ఐస్ %-% వంటి చల్లని స్పర్శనులి కలిగిస్తుంది.

సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవంలో విశాఖ టిడిపి నేతలు హాజరు..

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో బుధవారం విజయవాడలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం మహోత్సవానికి విశాఖ జిల్లాలో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు తో పాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. విశాఖ ఎంపీ శ్రీ భరత్ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్ ,గణబాబు, వంశీకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, తోపాటు అనకాపల్లి జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలంతా ప్రమాణ స్వీకారం మహోత్సవానికి వెళ్లారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కూడా ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగిందని పలువురు ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకార మహోత్సవ వేదిక దగ్గర నుంచి సెల్ఫీలు తీసుకొని తమ విజయాన్ని తెలియజేశారు.

చంద్రబాబు ప్రమాణస్వీకారం కారణంగా

పేదలకు భోజనాలు పెట్టిన బాలాజీ రాము

విశాలాంధ్ర-పెందుర్తి: ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టడాన్ని స్వాగతిస్తూ స్థానిక టీడీపీ నాయకులు సంబరాలు జరుపు కున్నారు. పలుచోట్ల బాణాసంచా కాల్చి, ఒకరికొకరు మిఠాయిలు తినిపిం చుకొని హర్షాతిరేకాలు వ్యక్తపరిచారు. కాగా నాయుడుతోటకు చెందిన అమరావతి హోటల్ యజమాని రాము అన్నా క్యాంటీన్ వద్ద పేదలకు అన్నసమారాధన నిర్వహించారు. బాబు రాకతో అన్నా క్యాంటీన్లు ప్రారంభమై, పేదలకు నాణ్యమైన ఆహారం అందుతుందన్న ఆకాంక్షతో ఆయన అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారం భించిన జీవిఎంసీ 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడాన్ని స్వాగతిస్తూ స్థానిక టీడీపీ నాయకుడు బాలాజీ రాము అన్నసమారాధన నిర్వహించడం హర్షదాయకమని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు ప్రారంభించే వరకు బాలాజీ రాము స్ఫూర్తితో తాము ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

గుండె ఆరోగ్యానికి ఆహారంలో మూడు పదార్థాలు తప్పనిసరి

విశాలాంధ్ర-విశాఖ సిటీ: గుండె ఆరోగ్యానికి సంబంధించి రోజువారి ఆహారంలో తప్పనిసరిగా మూడు ఆహార పదార్థాలు చేర్చాల్సి ఉందని న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి తెలిపారు. మెరుగైన గుండె ఆరోగ్యం కోసం ఒకరి ఆహారంలో చేర్చవలసిన అనేక ఆహార పదార్థాలలో 3 ముఖ్యమైనవిగా భావించాలన్నారు. బాదం, వెల్లుల్లి, తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బాదంపప్పులో కాల్షియం, విటమిన్ ఇ, మెగ్నీషియం, ఫైబర్ అధికంగా ఉంటాయని, ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి ఆహారంలో ఆరోగ్యకరమైన కొవ్వులను అందిస్తాయన్నారు. బాదం , ఇతర గింజలు కూడా రక్తనాళాల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయన్నారు. అదేవిధంగా ఓట్స్ పనిచేస్తాయని ఓట్స్‌లో కరిగే ఫైబర్ ఉంటుంది, ఇది మీ రక్తప్రవాహంలోకి "చెడు" కొలెస్ట్రాల్ శోషణను తగ్గించడం ద్వారా మీ ఎల్ డి ఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందన్నారు. ఇక వెల్లుల్లి కూడా భాగం చేయాలని, వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుందని, ఇది రక్తపోటు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయ పడుతుందన్నారు., తద్వారా గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుందన్నారు. అనేక అధ్యయనాలు ఈ అంశాలను బలపరిచాయని గుర్తు చేశారు.